# బతుకు పాఠాలు

"ఎప్పుడు పోతాడో, ఈ ముసలి కొడుకు!" అనుకున్నాడు సదాశివుడు, డాక్టరు ఇచ్చిన సెడెటివ్ ప్రభావంలో మత్తుగా పడివున్న తండ్రివంక చూసి. మెలకువ వచ్చి తన్ను చూస్తే అరుస్తాడు. తనకనుభవమే అది. రెండేళ్ళ క్రితం మొదటిసారిగా స్ట్రోక్ వచ్చినప్పుడు, ఆసుపత్రిలో చేరాడని తెల్సి తను ఆయన్ని చూడటానికి వచ్చినప్పుడు ఎంత రభస చేశాడు!

"ఎందుకొచ్చావ్! వెళ్ళు, నీమొహం నాకు చూపించకు. నేను చచ్చినా నువ్వు రావాల్సిన పనిలేదు. ఖో,ఖో" అని కసిరాడు, హైరానపడిపోతూ.

"అదేంది, చెన్నయ్యా! వాడు ఎంతైనా నీ కొడుకు. కని, పెంచిన తండ్రిపట్ల వాడికి ప్రేమ ఉండదా?" అన్నాడు డాక్టర్ అంకుల్, వెంకట్రావు.

"వాడు నేనెప్పుడు ఛస్తానా అని గోతికాడ నక్కలా కాచుకు కూర్చున్నాడు. నేను ఛస్తే, మిగిలిందేమైనా ఉంటే పట్టుకెళ్దామని వచ్చాడు. వాడికి నేనంటే ఏ మాత్రం అభిమానం ఉన్నా వెళ్ళమను, లేకపోతే నేను బలవంతంగా ప్రాణం తీసుకుంటాను."

గత్యంతరం లేక అప్పుడు తను తిరిగి వెళ్ళిపోవల్సి వచ్చింది.

ముసలాయనకు ప్రపంచం తెలియదు. ఎప్పుడో బూజుపట్టిన నీతి సూత్రాలు పట్టుకుని వేలాడతాడు. తను బతికిన సమాజంలోనూ ఆ నీతి సూత్రాలు పనిచెయ్యలేదు. 'ధర్మోరక్షతి రక్షిత:' అనేవాడు. తను ధర్మంగా నడుస్తున్నాననుకునే వాడు. తన్నేం ధర్మం రక్షించింది!

సబ్ ట్రెజరీ ఆఫీసులో గుమాస్తాగా జీవితం మొదలుపెట్టాడు ఆయన. స్వాతంత్ర్యం వచ్చాక రిజర్వేషను సౌకర్యం కల్పించింది భారత ప్రభుత్వం. బాబా సాహెబ్ అంబేద్కర్ పెట్టిన భిక్ష అది. లేకపోతే తమ కులాల వాళ్ళు పైకి వచ్చే తీరుందా ఈ దోపిడి సమాజంలో! అవకాశం ఉన్నా జీతం రాళ్ళు తప్ప అదనంగా సంపాదించింది లేదు.

మేనత్త ఆదెమ్మ తమ ఇంట్లోనే ఉండేది. మొగుడామెను వదిలేశాడు. ఆమెకో కూతురు, నిర్మల. తనకంటే మూడేళ్ళు చిన్నది. పెళ్లాం, బిడ్డలకు పైసలుపంపేవాడు కాదు ఆ

భ్రాష్టుడు. పెళ్ళాముండగానే మరో పెళ్ళి చేసుకున్నాడు. ప్రభుత్వోద్యోగి, రెవెన్యూ డిపార్టుమెంట్‌లో పని చేసేవాడు. వాడి ఉద్యోగం పీకించే అవకాశం ఉంది. కానీ, కేసు పెట్టలేదు తన తండ్రి.

"దాన్ని బతికుండగానే చంపుకుతిన్నాడు. ఆ చెరలోనుంచి అది బయటపడింది. అదేచాలు! నా తోడబుట్టిన దానికి రెండు ముద్దలు పెట్టలేకపోను. నా చెల్లెలికి జరిగిన అన్యాయం ఆ పైవాడు చూడకపోడు. ఆ దేవుడే అతడిని శిక్షిస్తాడు" అనేవాడు తన వాజమ్మ తండ్రి.

కానీ, దేవుడు తన మేనత్త మొగుడిని శిక్షించలేదు. తాశీల్దారుగా పనిచేసి, డిప్యూటీ కలెక్టరు కూడా అయ్యాడు. ఎడా, పెడా సంపాదించాడు. మన మనుకునే న్యాయం, ధర్మం ఈ ప్రపంచంలో లేవు. ధైర్యమున్న వాడు అడ్డంగా అయినా పైకి రాగలడని వాడిని చూసే తను పాఠం నేర్చుకున్నాడు.

తన ఆస్తిని దోచుకుతినటానికి వచ్చిన బికారివాళ్ళలా కన్పించేవాళ్లు తన మేనత్తా, నిర్మలా తనకు. అంతటితో పోలేదు, తన తండ్రి దానధర్మాలు. సుమారుగా తన ఈడువాళ్ళే ఇద్దరు తమ కులపు మొగపిల్లలకి తమ ఇంట్లో ఆశ్రయమిచ్చి చదువు చెప్పించాడు. ఏదో దూరపు చుట్టరికం ఉంది. అనాథలు.

"మనకు చేతనైన సాంఘిక న్యాయం ఇతరులకు కలిగించాలి. పై కులం వాళ్ళు మనకు చెయ్యలేదని మన మనుకుంటున్నాం. మనమోస్థితిలో ఉన్నాక మనవాళ్ళకు చేతనైంది చెయ్యకపోతే నా మనసూరుకోదు" అని చెప్పేవాడు. కొంప అనాథశరణాలయమైంది. వచ్చిన జీతం హారతికర్పూరమయ్యేది.

తనకు పదహారేళ్ళ వయసులో తన తల్లి బ్లడ్ క్యాన్సరుతో చనిపోయింది. తండ్రి డబ్బు ఖర్చుపెట్టి సరైన వైద్యం చేయిస్తే అమ్మ బతికేదేమో! ఆయన దగ్గర డబ్బులేదు. ఆ రోజుల్లోనూ రాయవెల్లూరు తీసుకెళ్ళాలంటే కనీసం లక్షయినా ఉండాలి. తాత ఇచ్చిన రెండెకరాలను అమ్మజూపాడు తండ్రి. ఆయన అవసరంలో ఉన్నాడు కనుక సరైన ధరపలకలేదు. వచ్చిన కాడికి తెగనమ్మెయ్యగలిగే ధైర్యం తన తండ్రికి లేదు. అమ్మకు వైద్యం చేయించలేదు ఆయన. డాక్టరు వెంకట్రావు, తన తండ్రి కలిసి చదువుకున్నారు. మంచి స్నేహితులు. "డబ్బు ఖర్చుపెట్టి వైద్యం చేయించినా అమ్మ బతికే అవకాశం లేదన్నాడు డాక్టరంకుల్. లుకోమియా జబ్బుకు మందులేదంట. కెమోథెరెపీ చేస్తారంట! 'మనిషిని హింస పెట్టడమెందుకూ? ఇంట్లోనే, అందర్నీ చూసుకుంటూ తృప్తిగాపోనీ' అన్నాడు అంకుల్" అని చెప్పాడు తండ్రి తనకు.

తన అసమర్ధతను కప్పి పుచ్చుకోటానికి చెప్పిన మాటలవి. పొలం అమ్మటం ఆయనకిష్టం లేదు. "నా తండ్రి ఇచ్చిన ఆస్తిని నా కొడుక్కిస్తేనే నాకు తృప్తి" అని ఆయన తరుచూ అనటంలోని ఆంతర్యం అదే. ఆఫీసులో అదనంగా డబ్బు సంపాదించే అవకాశాలున్నా ఆ పని చేసే ధైర్యం ఆయనకు లేదు. పైగా నీతులు వల్లించేవాడు. ఆయన్ని చూసే తను జీవితంలో మొదటి పాఠం నేర్చుకున్నాడు అసమర్ధుడే నీతి సూత్రాలు వల్లిస్తాడని! ఇలాంటి అసమర్ధుడిని కట్టుకున్న అమ్మదే దురదృష్టం. ఆమె రెండు నెలల్లో చనిపోయింది.

తాత ఇచ్చిన రెండెకరాల్లో పంట వచ్చేది కనుక తిండికి ఇబ్బంది లేకుండా గడిచిపోయేది. నలుగురు అనాథలతో కొంప కటకటగా గడిచేది. తల్లి చనిపోయిన దిగుల్లో తను సరిగా చదవలేకపోయాడు. ఇంట్లో చదువుకోవటానికి తగిన వాతావరణం కూడా ఉండేది కాదు. ఇంట్లో ఆ దిక్కుమాలినవాళ్ళను చూస్తే తనకు ఉండబుద్ధయ్యేది కాదు. తను ఇంటర్ తప్పాడు. మరుసటేడు పాసయినా తన్ను బిఏలో చేర్పిస్తానన్నాడు కానీ, మా ఇంట్లోని వెధవ పోతురాజును కాకినాడ పంపి ఇంజనీరింగ్ చదివించినట్టు తన్నూ ఇంజనీరు చెయ్యలేకపోయాడు. వాడికి మంచి మార్కులు వచ్చాయంట! ఎంసెట్‌లో ర్యాంకు వచ్చిందంట! తను ఎలిజిబిలిటీ మార్కులు కూడా తెచ్చుకోలేకపోయానంట! డొనేషను కట్టి చదివించే స్తోమత తనకు లేదంట!

"నీకు కనీసం ర్యాంకు వచ్చినా నిన్నూ చదివించే వాడినే. డొనేషన్లు కట్టి చదివించడం నా వల్ల కాదు. ఉన్న ఊళ్ళో డిగ్రీ చెయ్యి. రిజర్వేషనులో ఏదో ఉద్యోగం దొరక్కపోదు. ఎత్తలేని భారాన్ని ఎవడూ మొయ్యకూడదు" అంటూ నీతి చెప్పాడు. తన కోసమే పొలం అని చెప్పే మనిషి పొలం అమ్మి తన్ను చదివించవచ్చుగా? ఆహఁ, ఆ పని ఆయనకిష్టం లేదు. అమ్మ ప్రాణాన్నీ, తన చదువునీ హరించాడా పెద్ద మనిషి!

బిఏ చదివే రోజుల్లో హరితతో పరిచయమైంది తనకు. తండ్రి తమ పెళ్ళికి అంగీకరించలేదు. ఆయన మాటలకు, చేతలకు ఎంతో తేడా ఉంది. ఆయన వల్లించే మాటలు తనకిప్పటికీ గుర్తు.

"కులాలన్నీ మనం సృష్టించుకున్నవే. వేదకాలంలో కులాలుండేవి కావు. ఆర్యుల కాలంలో అందరూ మాంసం తినేవాళ్ళు. పశువులను చంపటం, తోలు వలవటం దుర్వాసనతో, అసహ్యంతో కూడుకున్న పని. సమాజంలో ఎవరో ఒకరు ఆ పని చెయ్యాలి కనుక ఆ పని చేసే వాళ్ళను క్రమంగా సమాజం బైటికి నెట్టి, చాతుర్వర్ణ సమాజం ఏర్పడ్డాక, వాళ్ళను పంచములు, అంత్యజులు అన్నారు. మహాభారతం భీష్మపర్వంలో

ఏం ఉందో తెల్సా? 'అంత్యజోవిప్రజాతశ్చ ఏక ఏవ సహోదరః ఏకయోనీ ప్రశూతశ్చ ఏక శాఖేన జాయతే' అని. ఆ తర్వాత జైన, బౌద్ధాలొచ్చాయి. అహింస పరమధర్మమయింది. వ్యవసాయం అభివృద్ధి పొందింది. అందుకోసం మౌర్యుల కాలంలో అన్ని వృత్తుల వారూ ఉండే స్వయం సంపూర్ణ గ్రామీణ వ్యవస్థకు అంకురార్పణ జరిగింది. వ్యవసాయం పురోగతికి చేతి పనులు చేసే పంచాణం వారు అంటే కంచరి, కుమ్మరి, కంసాలి, ముచ్చె, వడ్రంగి ఎంతో దోహదం చేశారు. కాలక్రమేణా వృత్తిపరమైన అశుభ్రత, దుర్గంధం వల్ల ముచ్చెలను అంటే చర్మకారులను బయటికి నెట్టి, రాతిపనిచేసే కాసెలకు పంచాణంలో స్థానం కల్పించారు. ముచ్చెలను ఊరిపొలిమేరలకు తరిమినా వాళ్ళతో సమాజానికి అవసరం. అందుకే చర్మకారుల కుటుంబాల్లోని ఓ కుటుంబాన్ని ఎంపిక చేసుకుని, వారిచేత కొంత శుచి, శుభ్రతలు పాటింపచేసి, చర్మఉత్పత్తులను వారిచేత గ్రామంలోనికి తెప్పించుకునే వాళ్లు. ఈ కుటుంబం వారిని ఊళ్ళో వాళ్లూ, ఊరిబయటి మాదిగలు 'మాలోనివాడు' లేదా 'మాలోవాడు' అనేవాళ్ళు. చివరకు వాళ్ళే మాలవాళ్ళయ్యారు. జాంబపురాణం ప్రకారం మాదిగలు జాంబవంతుని సంతతి. మనం చెన్నయ్య సంతతి. మనం చర్మకార వృత్తికి స్వస్తి చెప్పి, కొంత నాగరికజీవితం అలవరచుకున్నాం. మనలో కొంత మంది తమ ఆధ్యాత్మిక చింతనకు మాల దాసరులుగా కూడా పేరు తెచ్చుకున్నారు. కనుక కులాలు మనం సృష్టించుకున్నవే. వృత్తుల వల్ల ఏర్పడ్డవే".

అలా కులాలు లేవని ఉపన్యసించే పెద్దమనిషి హరిత విషయం వచ్చేసరికి, "వాళ్ళు ఎడం చేతి కులం వాళ్ళు. మనం కుడిచేతి కులం వాళ్ళం. ఆ అమ్మాయిని కోడలు చేసుకోవటానికి నేనంగీకరించను. అత్తమ్మ కూతురు నిర్మలను నువ్వు చేసుకోవాలి. మన పంచన చేరిన ఆడకూతురికి మార్గం చూపాలి" అన్నాడు మాలదాసరి చెన్నయ్య.

ఆయన మాటలకు తనకు ఒళ్ళు మండిపోయింది. "దాన్ని నేను చేసుకోను. అదంటే నాకసహ్యం. కులాల్లేవంటావు కానీ, నీ అంత కుల పట్టింపు ఉన్న మనిషి మరొకడు లేడు" అన్నాడు తను.

"నువ్వు ముందు చదువు పూర్తి చెయ్యి. నౌకరి సంపాదించి నీకాళ్ళ మీద నువ్వు నిలబడు. అప్పుడు ఆలోచిద్దాం" అన్నాడు, తన ప్రస్తావనను అప్పటికి వాయిదా వేసే ఆలోచనలో, వయసు పొంగుచల్లారిన తన తండ్రి. ప్రేమ పెళ్ళికి పెద్దలే పెద్ద అడ్డంకి అని అప్పుడు తను మరోపాఠం నేర్చుకున్నాడు.

కానీ, తను తండ్రి మాట వినలేదు. తండ్రికి చెప్పకుండా హరితను పెళ్లి చేసుకున్నాడు. చదువుమానేశాడు. ఉద్యోగాలకు ప్రయత్నించాడు. ప్యూను ఉద్యోగం కూడా దొరకలేదు.

"ఉద్యోగం చేసి ఏం సంపాదిస్తావు! వచ్చేది కూడు, గుడ్డకు కూడా సరిపోదు! వ్యాపారం చేద్దాం. మీ నాయన్నడిగి ఓ రెండు లక్షలు పట్టుకురా. నేనూ సాయం చేస్తాను. ఓ చిన్న ఫ్యాన్సీ దుకాణం పెట్టుకున్నా గడిచిపోతుంది. పైకి రావచ్చు" అని సలహా ఇచ్చాడు హరిత తండ్రి.

మామకో కల్లు దుకాణం ఉంది. బాగానే సంపాదిస్తాడు కానీ పెద్ద సంసారమవటం వల్ల ఎంతొచ్చినా ఖర్చయిపోయేది. మామగారి సలహా ప్రకారం తను తండ్రి దగ్గరకు వెళ్లి డబ్బడిగాడు. ఆయన తన్ను తిట్టినతిట్టు తిట్ట కుండా తిట్టాడు. "నీకు నిలకడ లేదు. నువ్వేపనీ దీక్షగా చెయ్యలేవు. నేను డబ్బివ్వను" అని మొండికేశాడు.

"ఇవ్వవు. నువ్వెందుకిస్తావ్! అనాథల పోషణకైతే ఎంతయినా ఇస్తావు! మా అమ్మను చంపావు. నాకు చదువు చెప్పించకుండా నా బతుకు బుగ్గిపాలు చేశావు. నీలాంటి తండ్రి ఉన్నవాడికి ఆత్మహత్య తప్ప మరోమార్గం లేదు. రెండు రోజుల్లో ఉన్న ఒక్కగానొక్క కొడుకు చచ్చాడన్న వార్త విని సంతోషించు. ఇదే మనం చివరిసారి కలుసుకోవటం" అని తను బెదిరించాడు.

"ఆ మూర్ఖపు వెధవ అన్నంత పనీ సేత్తాడు, అన్నయ్యా! సెట్టంత బిడ్డ పోయాక డబ్బేం సేసుకోను! యాపారం అంటున్నాడు. ఆడికి నువ్వు కాక ఎవరు సాయం సేత్తారు" అంది తన మేనత్త.

తన తండ్రి దిగివచ్చాడు. అప్పుడే తనకు తెల్సింది సెంటిమెంట్‌తో కూడా మనుషుల్ని చావగొట్టొచ్చని! ఏంతంటాలు పడ్డాడో మరి, ప్రావిడెంటు ఫండులో లోను తీసుకున్నానని చెప్పి ఓ లక్ష రూపాయలు మాత్రం ఇచ్చాడు. "ఇంతకంటే నా వల్లకాదు. ఇంక డబ్బంటూ నా దగ్గరకు రావద్దు" అన్నాడు.

తీరా ఆ లక్షా తను తీసుకెళ్ళి మామకిస్తే, "లక్షకేం బిజినెస్సు పెడతామయ్యా! సరే, ఉండనీ. ఏం చెయ్యాలో ఆలోచిద్దాం" అన్నాడు ఆయన.

అక్కడికీ తను నసిగాడు "మీరిస్తానన్నారుగా?" అని.

మామ మాట్లాడలేదు.

డబ్బిచ్చిన కొత్తల్లో హరిత తన్ను ఎంతో ప్రేమగా చూసింది. "మన డబ్బు మనకుంటే స్వతంత్రంగా ఉంటుంది. ఎన్నాళ్ళు నాన్న మీదపడి తింటాం" అంది.

తన అవసరానికేమన్నా డబ్బు కావాలంటే ఇచ్చేది.

ఒకసారి బావమరుదులు తన్ను బలవంతాన బారుకు తీసుకెళ్లారు. పెద్ద బావమరిదికి కొడుకు పుట్టాడు. ఆ సంతోషంలో అలా వేడుక చెయ్యాలనుకున్నాడు. ఛాందసుడి కొంపలో

పుట్టిన తనకు ఏం చేయ్యాలన్నా బెరుకే. తాగుడు కొద్దికొద్దిగా అలవాటు చేశాక, తాగటంలో ఉన్న ప్రయోజనాన్ని వాళ్ళు తనకు బోధచేశారు. ఏడాది తిరిగేలోపల తండ్రి ఇచ్చిన లక్షా పూర్తియింది. తాగటంలో ప్రజ్ఞావంతుడయ్యాడు తను.

"నువ్వు నౌకరి అయినా సంపాదించే ప్రయత్నం చెయ్యి. లేదూ మీ నాన్ననడిగి డబ్బయినా పట్టుకురా. ఎంతకాలమని మా వాళ్ళు మేపుతారు" అని అంది హరిత.

"నేనిచ్చిన లక్షా అయిపోయిందా?" అనడిగాడుతను.

"ఎన్నాళ్ళుంటుందేం, నీ లచ్చా?" అంది హరిత ఎకసెక్కెంగా.

మళ్ళీ తను అరకొరగా ఉద్యోగ ప్రయత్నాలు చేశాడు. మామ రికమెండేషన్ మీద ఓ బట్టల షాపులో సేల్స్‌మన్ ఉద్యోగం దొరికింది. నెలరోజుల్లో ఒళ్ళు పులిసిపోయింది. వాడిచ్చే వెయ్యి రూపాయలకు ఆ అరవచాకిరీ చెయ్యటం ఇష్టంలేక పోయింది. సేల్స్‌మన్ పనేకాకుండా అడ్డమైన పనులూ చెప్పేవాడు షాపుకారు. కస్టమర్లకు సోడాలు, చాయ్‌లు తెమ్మని పంపేవాడు. ఆ మాటపైకి అనేవాడు కాదుగానీ, కులం తక్కువ వాడివన్నట్టు చూసేవాడు. అగ్రవర్ణ దురహంకారం!

అలా ఏం చేయ్యాలో తోచక అవస్థపడుతున్న తరుణంలో తండ్రి కలిశాడు. తన మేనత్త చనిపోయిందంట! నిర్మల పెళ్ళి చేస్తే, తనభారం వదిలి పోతుందంట! తనింకా రిటైరు కావటానికి సంవత్సరముందంట! పోతురాజు కూడా చేసుకుంటానన్నాడంట! నిర్మలకూ ఇష్టమేనంట!

"వాడు బందరు కరెంటు ఆఫీసులో జె.యిగా పనిచేస్తున్నాడు. పిల్ల సుఖపడ్తుంది. కానీ వాడి మేనమామ యాభైవేల కట్నమిస్తే గానీ వీల్లేదంటున్నాడు. నాకు మరేం గత్యంతరం కనబడలేదు. పొలం బేరానికి పెట్టాను. మూడు లక్షలకు సెటిలయింది. అది తాత ఆస్తి కనుక నీ సంతకమూ కావాలంటున్నారు కొనేవాళ్లు" అని చెప్పాడు.

ఇప్పుడు ఎక్కడి నుంచి వచ్చాడు, ఆ మేనమామ అని తను అయన్ను అడగలేదు. పెంచిపోషించి, చదువు చెప్పించిన పోతురాజుకూ, చెల్లెలి కూతురికీ తనకు చెందాల్సిన డబ్బును కట్టబెడుతున్న తండ్రిని చూస్తే ఒళ్ళు మండిపోయింది తనకు.

"మరినాకేమిస్తావు?" అడిగాడుతను.

"నాకున్నదంతా నీది కాదురా?" అనేదో అనునయించబోయాడు కానీ, కచ్చితంగా ఇంత ఇస్తానని మాత్రం చెప్పలేదు.

మన అవసరం ఉన్నప్పుడే మనుషులు లొంగుతారని తనకర్థమైంది.

"అందులో సగం-లక్షన్నర ముందుగా నాకిస్తే గానీ నేను సంతకం పెట్టను" అని తను కచ్చితంగా చెప్పేశాడు.

ముసలాడికి గత్యంతరం లేకపోయింది. కొనేవాళ్ళ దగ్గర లక్షన్నర అడ్వాన్సు తీసుకుని తనకిచ్చాడు. మిగతా డబ్బుతో నిర్మల పెళ్ళి జరిపించాడు. తనకు న్యాయంగా రావాల్సిన తన డబ్బు తిన్న దాని పెళ్ళికి వెళ్ళ బుద్ధికాలేదు తనకు.

అంతకు ముందు మొత్తం డబ్బు మామకిచ్చి తను దెబ్బ తిన్నాడు. యాభైవేలు మాత్రం హరితకిచ్చి మిగిలిన లక్షా తను బ్యాంకులో వేసుకున్నాడు. డబ్బొచ్చాక తనకాబోడి సేల్స్‌మన్ ఉద్యోగం చెయ్యటం ఇష్టం లేకపోయింది, మానేశాడు. ఏం బిజినెస్ చేద్దామా అన్న ఆలోచనలో ఉన్నాడు.

తన దగ్గర డబ్బున్న విషయం మామకు సంవత్సరందాకా తెలియలేదు. తెలిశాక, కదిలేశాడు, "డబ్బు ఏం చేశావ్?" అని.

"నా దగ్గరే ఉంది. బిజినెస్ చెయ్యాలి. ఏదీ తోచటంలేదు" అన్నాడు తను.

"లక్షలో ఏం బిజినెస్సయ్యా? కిందటిసారీ ఇలాగే చేశావు. కూర్చుని తినేశావు. మీ ఇల్లు కూడా మీ తాత సంపాదించిందే. దాంట్లో నీకు వాటా రావద్దా? దాన్నమ్మేస్తే వచ్చే ఆ డబ్బుతోనూ, నీ దగ్గర ఉన్నదాంతోనూ ఏదైనా చెయ్యొచ్చు."

ఆయన అన్నమాటా నిజమేననిపించింది. మామ సలహాతో తను తండ్రికి లాయరు నోటీసు పంపాడు. ముసలాడికి కోర్టులు, లాయర్లూ ఆ గందరగోళం తెల్సిచావదు. దెబ్బకుదిగి వచ్చాడు. బతిమిలాడాడు. తన తండ్రి చెమటతో కట్టిన ఇల్లంట! సెంటిమెంటల్ ఫూల్! పెంకుటిల్లు పాతది. ఇంటికి విలువలేదు. కానీ పెరుగుతున్న పట్నం తెనాలి. ఒకప్పుడు ఊరుబయట ఉన్న ఇల్లు ఇప్పుడు సెంటర్ అయింది. స్థలానికే కనీసం రెండు లక్షలయినా వస్తాయి.

లక్ష ఇస్తే, తనవంతు హక్కులు వదులుకుంటానన్నాడు తను. తప్పలేదు ముసలాడికి. తన్ను నమ్మటమెప్పుడో మానుకున్నాడు. తన రిటైర్‌మెంటు బెనిఫిట్‌లో నుంచి లక్ష ఇచ్చాడు. ఇంక ఇంటిపై తనకేమీ హక్కులేదని రాయించుకున్నాడు. తెలివితక్కువ మనిషి! ఆయనకు తనొక్కడే వారసుడు. తనకు ఇంటిపై హక్కెలా లేకుండా పోతుంది!

"నన్ను నిలువుదోపిడి చేశావు. నన్నింక వదిలెయ్యి" అని అర్థించాడు.

ముసలాడికంతే కావాలి! తనతల్లిని చంపాడు, తనకు పై చదువులు చదివే అవకాశం లేకుండా చేశాడు. కొంపను సత్రం చేశాడు. కన్న బిడ్డను తన్నుకాదని తన డబ్బు, తనకొంప పై పడితిన్న అనాథవెధవలకు కట్ట బెట్టాడు.

ఉన్న రెండు లక్షలతో పెద్ద బావమరిది గంగులూ, తనూ కల్సి ఓ ఫ్యాన్సీ దుకాణం తెరిచారు. ఓ నెలరోజులు దుకాణంలో కూర్చున్నాక, తనకాపనీ విసుగేసింది.

"నీకెందుకు బావా, ఈ రోష్టు! మాలదాసరోళ్ళు మీరు! నువ్వెళ్ళి రెస్టు తీసుకో. నేను చూసుకుంటాను" అన్నాడు గంగులు.

అంతే, తను దుకాణం వెళ్ళటం మానుకున్నాడు. సరదాకు మొదలెట్టిన తాగుడు ఇప్పుడు అలవాటయి కూర్చున్నది. ఇంట్లో అందరూ తన్ను పట్టించుకోవటం మానేశారు.

పెళ్ళయి పదేళ్ళు కావస్తున్నా తమకు పిల్లలు కలుగలేదు. "ఎందుకే నీకా నపుంసకం మొగుడు. ఆడ్ని వదిలించుకో" అని ఒకసారి అత్త తన కూతురితో అనటం విన్పించింది. హరితకూ తనంటే మోజు తీరిపోయినట్టుంది.

ఓసారి తాగటానికి డబ్బివ్వమంటే ఇవ్వలేదు. గొడవైంది.

"నీ లాంటి జులాయి ఎదవ నాకక్కర్లలేదు. నీకు పనిగండం. పనిచెయ్యవు. తాగుడికే డబ్బంతా తగలెట్టావు. నీకు నాకూ ఏ సంబందం లేదు. నా ఇంట్లో ఉండొద్దు. ఎళ్ళిపో" అంది అరుస్తూ.

అది అంతమాటన్నాక తను ఊర్కోలేదు. దాన్ని కొట్టాడు. మామ, బావమర్దులు అడ్డొచ్చి, తన్ను చావచితకకొట్టారు. వీధిలోకి గెంటారు. ఆ కులమే అంత! నీతా జాతా?

అత్తదుమ్మెత్తిపోసింది. "మొగతనం లేనోడివి. అయినా, నా కూతురు ఇన్నేళ్ళూ బరించింది. పువ్వుల్లోపెట్టుకు చూసుకున్నా నా కూతుర్ని. అట్టాంటి దాన్ని కొడతావా? నీ జిమ్మడ! నీకు పుట్టగతులు లేకుండా పోను! ఎళ్ళు..! నా ఇంట్లో చనం ఉన్నావంటే సంపేత్తాను".

"నా డబ్బివ్వు. నేను వెళ్ళిపోతాను" అన్నాడు తను.

"నీ డబ్బంతా నీతాగుడికే సరిపోయింది. మిగిలిందేం లేదు" అన్నాడు గుంగులు.

అలా పెళ్ళాం తన్ను వదిలేశాక, తక్కువ కులంతో తండ్రి సంబంధం ఎందుకు వద్దన్నాడో తనకు అర్థమైంది. ఆ తర్వాత నానా తిప్పలు పడ్డాడు. హోటళ్ళల్లో కప్పులు కడిగాడు, బళ్ళులాగాడు, మూటలుమోశాడు. ఏ రోజుకారోజు తన జానెడు పొట్ట నింపటం కష్టమైంది తనకు. తన దుస్థితి తెల్సినా ముసలాడు తన్ను వచ్చి పలకరించలేదు. ఇంటికి రమ్మని అడగలేదు. కన్న కొడుకును అలాంటి దుస్థితిలో వదిలేసిన వాడు ఏం తండ్రి! తన ఈ దుస్థితికి కారణమైన తండ్రినీ, పెళ్లాన్నీ చంపాలన్న కసి తనలో పెరిగిపోయింది.

ఎవరో చెప్పారు. ముసలాడు గుండె జబ్బుతో డాక్టరు వెంకట్రావు ఆసుపత్రిలో చేరాడని. తనకు రావల్సిందేమన్నా ఉంటే మందులు, వైద్యం అంటూ ఆ డాక్టరు మింగేస్తాడు. ముసలాడు ఛస్తే కానీ తన జీవితం బాగుపడదు. ఉన్న కొంప అమ్ముకున్నా ఏదో పద్ధతిలో జీవితం గడిపేయవచ్చు.

తన్ను చూసి, "వచ్చావా! ఫరవాలేదు. గండం గడిచిపోతుంది. నీ కోసం తపించి పోయాడు మీ నాయన. కనిపెట్టుకు ఉండు" అన్నాడు డాక్టరు వెంకట్రావు.

రాత్రి పదిగంటలయిందేమో. అపస్మారక స్థితిలో ఆ గదిలో బెడ్‌మీద పడుకుని ఉన్న తండ్రిని చూసి కంపరం కలిగింది సదాశివుడికి. 'ఇంకా బతికి ఏం చేయాలి, పాపిష్టివాడు! ఈ ముసలాడు బతికుంటే తనకు అగచాట్లు తప్పవు. డాక్టరు గండం గడిచిందన్నాడు. వీడు బతికితే తనకు గండమే' అన్పించింది అతనికి. తండ్రి చేసిన దుర్మార్గాలన్నీ పిశాచాల్లా నర్తించాయి అతని ముందు. ఏదోపిచ్చి ఆవేశమొచ్చినట్లు ఆ ముసలిప్రాణి వంకాచూశాడు. 'వీడు బతక్కూడదు' అని గొణుకున్నాడు.

చెన్నయ్య తల కింద ఉన్న దిండు తీసి ముఖం మీద వేసి అదిమాడు. చెన్నయ్య గిలగిలా కొట్టుకున్నాడు. కదలకుండా గుండెల మీద మోకాలు పెట్టి దిండును మరింతగా అదిమాడు. చెన్నయ్యలో కదలిక ఆగిపోయింది. నిర్జీవుడైపోయాడు.

చెన్నయ్యకు ఇంజెక్షను ఇవ్వటానికి వచ్చిన నర్సు ఇదిచూసి, "ముసలాయన్ను చంపేస్తున్నాడు కొడుకు!" అని పెద్దగా అరిచింది. జనం పోగయ్యారు. డాక్టరు వెంకట్రావు పరుగెత్తుకుంటూ వచ్చాడు.

చెన్నయ్య చనిపోయాడని నిర్ధారణ చేసుకున్నాక, "ఛీ! ఏం పుటక పుట్టావురా!" అని ఛీదరించుకున్నాడు డాక్టరు.

అతను అక్కడనుండి పారిపోప్రయత్నించాడు. కాంపౌండర్లు, వార్డు బాయ్‌లు అతన్ని కట్టి పడేశారు.

పోలీసులొచ్చి, తన్ను అరెస్టుచేసి బేడీలు వేసి పట్టుకెళ్తుంటే అనుకున్నాడు సదాశివుడు "మెలకువ వస్తే, ఆ సీసాలో మరోమాత్ర ఇవ్వు. మత్తొచ్చిహాయిగా నిద్రపోతాడు" అని డాక్టరు ఇచ్చిన సీసాలోనుంచి మరోమూడు మాత్రలు మింగించి ఉంటే గుట్టుచప్పుడు కాకుండా పనయిపోయి ఉండేది. ఆవేశపడి తను అనర్థం తెచ్చుకున్నాడు అని.

ఆవేశం బుద్ధిని నాశనం చేస్తుందని చాలా ఆలస్యంగా పాఠం నేర్చుకున్నాడు సదాశివుడు. పాపం! బతుకులో తను నేర్చుకోవల్సిన పాఠాలు ఇంకా చాలా ఉన్నాయని సదాశివుడికి తెలియదు.

**మనభూమి** *(మాసపత్రిక, జూన్ 2005)*